గారు కోపముతో మీకు విందునులేదు, గిందునులేదు పొండని కసిరెను. దానితో కవులందరు ప్రమాదము తప్పి ఆకులముందు నుండి సంతోషముతో లేచిపోయి తెనాలి రామకృష్ణునియుక్తికి పొగిడిరి. బాలలూ చూచితిరా తెనాలి రామకృష్ణుని సమయ స్ఫూర్తి! మహమ్మదీయులకు పందియనిన సరిపడదని తెలిసిగదా యుక్తిగా తోడి పండితుల ఆచార సాంప్రదాయములకు భంగముకలుగకుండాను, నవాబుకు తాము రాలేదనే కోపము కలుగకుండాను తప్పించెను!

కాబట్టి యుక్తితో ఎంతటి ఆపదనుండైనను తప్పించుకోవచ్చును, కార్యసిద్ధి పొందవచ్చును.

—— (o) ——

# దిష్టిబొమ్మ

**శ్రీ చామర్తి సుబ్రహ్మణ్యం**

టైమయిందంటూ గోపి నా దగ్గరకు వచ్చాడు. నేను కంగారుగా టైంటేబిల్ ప్రకారం పుస్తకాలు సర్దుకుని సంచిభుజాన తగిలించుకుని రెడీగా ఉన్నాను. గోపిగాడు కూడా పుస్తకాలు సర్దుకుని వచ్చేశాడు. ఇద్దరం స్కూలుకు బయలుదేరాం. అడ్డత్రోవన పోదామా! నిలువ త్రోవన పోదామా! అని ఇద్దరికి సంశయము వచ్చింది. అడ్డదోవనే పోదాం రా, అని అన్నాడు గోపిగాడు, జడ్జీలా ఫోజుపెట్టి. ఏం? నిలువదోవన ఎందుకు పోకూడదు? అని ఎదురుప్రశ్న వేశా. నువ్వు ప్రతీ విషయంలోనూ ఎదురు సమాధానం చెప్తావ్. ఇది మామిడికాయల కాలం గదా! ఒకటోరకమైన కారం పట్టుకొచ్చా, దోవలోనున్న పుల్లయ్యగారి తోటలో బంగినిపల్లి కాయలు కోసుకు తిందాం. మనకు ఫస్టుపిరీడ్ ఖాళీయే గదా! అని అన్నాడు నా ప్రశ్నకు సమాధానమిస్తూ.

వాడి ప్లాను చాలా బాగుందని మెచ్చుకున్నా. ఎందుచేతనంటే నాకు మామిడికాయలంటే పరమ ఇష్టం. అందులో బంగినపల్లి కాయంటే చెవి కోసుకుంటాను. అడ్డదోవనే పోవుటకు నిశ్చయించి బయలుదేరాం. పుల్లయ్యగారి మామిడి తోపులోకి ఏ విధంగా ప్రవేశించాలి. ఏ విధంగా కాపలావాని కళ్ళుగప్పి మామిడికాయలు దొంగిలించాలి అన్న విషయములపై మేమిరువురమూ గమనాన్ని సాగిస్తూ చర్చించుకొన్నాం.

పుల్లయ్యగారితోట సమీపించాం. బరువుగా అడుగులు పడసాగాయి. తీరా తోటలోకి ప్రవేశించగనే ఎదురుగుండా యమధర్మరాజులా సాక్షాత్కరించాడు కాపలావాడు. ఇక ఆ ప్రాంతములో ఓ నిముషమైనా ఉంటే ఒట్టు. ఇద్దరం స్కూలు వైపు పరుగులు తీశాం.

స్కూలుగంట టైమయిందని సూచిస్తూ గణ గణా మ్రోగింది. సమయానికే వచ్చాం గదాయని సంతోషంతో ఉన్నాం. మా స్కూల్లోనూ, ఊళ్లోనుకూడా ఏ మంచిపని చేసినా, ఏ చెడ్డపని చేసినా మేమిద్దరం కలిసికట్టుగా చేసేవాళ్ళం. ఊళ్ళోవాళ్ళూ, స్కూల్లోవాళ్ళూ మా మంచిపనులు చూసి మెచ్చుకొనేవారు, మా చెడ్డపనులు చూసి తిట్టేవారు. మంగళము, అమంగళము మమ్మే వరించేవి.

స్కూలులో మా నియమిత స్థలాల్లో ఆసీనులయ్యాం. మా గోపిగాడు కూడా నా ప్రక్కనే కూర్చుంటున్నాడు. మా శరీరాలు అక్కడ ప్రెజంటుగా ఉన్నాయేకాని, మా మనస్సులు మాత్రం పుల్లయ్యగారి తోటలోనున్న మామిడికాయలమీద ఉంది.

బెల్ ఎప్పుడైందోకాని మా లెక్కల మాష్టారు క్లాసులో ప్రవేశించారు. మాదృష్టి మామిడికాయల మీదవున్న కారణంగా క్లాసులోకి ఎవరు వస్తున్నారో ఎవరు వెళ్తున్నారో కూడా తెలియకుండా ఉంది. మా లెక్కల టీచరు మమ్మల్ని సమీపించి, ఏరా హోమ్ వర్కు చేశావా? అనేదాకా మేమీ బాహ్య ప్రపంచంలోకి రానేలేదు. ఒక్కసారి కంగారుగా లేచిచెయ్యి — చెయ్యి — లేదండీ అని తడబడుతూ

అన్నాను. ఇక చూసుకోండి మా వీపు విమానం మోతెక్కిందంటే నమ్మండి. రెండు ఫిరడ్సు బెంచీ ఎక్కించాడు.

ఎలాగో ఆరోజు గడిపేశాం. సాయంత్రమే యిద్దరం ఊరవతల పొలిమేరలో సాయంత్రపు చల్లగాలులను పీలుస్తూ బ్రహ్మాండమైన ప్లానులు వేయసాగాం. చీకటి పడింది. ఎవరిండ్లకు వాళ్ళు పోయాం.

రాత్రల్లా ఇదే ఆలోచన. ఏవిధంగా మామిడి కాయలు దొంగిలించడమా అని. ఆలోచనలతో నా బుఱ్ఱ వేడెక్కిపోయింది. కళ్ళు మూతలు పడసాగాయ్. శరీరము పరుపుమీద వాలింది.

తెల్లవారింది. కాలకృత్యాలు తీర్చుకున్నా. మళ్ళీ యథాప్రకారం ఇద్దరం కలుసుకున్నాం. సరిగ్గా తొమ్మిది గంటలకు మంచి శకునం చూసుకుని బయలుదేరాం.

మధ్యలో నాకు ఓ బ్రహ్మాండమైన ఆలోచన తట్టింది. ఒరే గోపీ! నాకొక ఆలోచన తట్టుతోంది. దాంతో మన విజయం తథ్యం అని అన్నాను. త్వరగా చెప్పు నన్ను చంపుకుతినక అని అన్నాడు గోపిగాడు. ఒరే గోపీ! మొదట నేను పోయి కాపలా వానిని సమీపించి హస్కు కొడతాను. ఈలోగా చప్పుడు కాకుండా తోటలో ప్రవేశించు, ఇది నా ప్లాను. నీ ఒపీనియన్ ఏమిటో చెప్పు అన్నాను. బ్రహ్మాండంగా ఉందిరా నీ ప్లాను. బెస్టయిన ఉపాయం చెప్పినందుకు నీకు వాటా ఎక్కువిస్తానులే అని అన్నాడు. నేను విజయోత్సాహంతో సినిమాలలో హీరోలా మొహంపెట్టి ప్రకృతివైపు ఫోజు ఇవ్వసాగాను.

తోటను సమీపించాం. నిన్నటికన్న మా కీరోజున ధైర్యంగా ఉంది. నేను దర్జాగా ఆ కాపలావానిని సమీపించి ఏరా అబ్బీ! ఈ తోట ఎవరిదిరా అని అన్నాను, నాకాతోట ఎవరిదో తెలియనట్లు.

పుల్లయ్యగారి తోటండి. కూచోండి బాబూ అని అన్నాడు. ఓహో వీడు మనకు బ్రహ్మాండమైన గౌరవం చూపుతున్నాడు. ఇదీ ఒక శుభసూచకమే అని అనుకొని వానితో సంభాషణ ప్రారంభించాను.

ఏరా అబ్బీ! కాపలా ఉన్నందుకు నీకు నెలకు ఎంతిస్తారురా అని అన్నాను.

ఏం కాండి బాబయ్యా! గుడ్డోన్ని కదండీ! ఇలాటి పనికన్నా ఏ పనీ సెయ్యలేనండి. అందుకని అరు నాకు నెలకి అయిదు రూపాయ లిత్తారండి అని అన్నాడు.

నేను దూరానవున్న మా గోపిగాడికి సిగ్నల్సు ఇచ్చాను. అయితే నీకా అయిదు రూపాయలు సరిపోతాయా అని అన్నాను.

ఏం సేత్తానండి బాబయ్యా – మాపిటికి సందాకవలం అడుకుంటానండి. దాంతో కాలచ్ఛేపం సేత్తానండి అని అన్నాడు.

ఈ మధ్యలోనే నాకో అనుమానం కలిగింది. గోపిగాడు ఎక్కువ కాయలు కోసుకొని నాకు తక్కువ ఇస్తాడేమో. ఏరా అబ్బీ నేను వెళ్తున్నాను. అని కాపలావానితో అన్నాను. సిత్తం బాబయ్యా! అన్నాడు.

నేనుకూడా తోటలోకి ప్రవేశించా. ఎలాగయితేనేం మా గోపిగాడిని కలుసుకున్నా. ఆ తోటం చాలా పెద్దది. ఎండిన ఆకుల చప్పుడు కాకుండా ఎత్తి ఎత్తి అడుగులు వేస్తూ నడుస్తున్నాం. సడన్‌గా మా కాళ్ళకు బ్రేకులుపడ్డాయి. ఎదురుగా ఓ మామిడి చెట్టుక్రింద ఓ మనిషి నుంచున్నట్టున్నాడు. అతగాడి చేతిలో ఓ సాఫయిన కర్ర ఉంది. వాడు మాకేసే చూస్తున్నట్టుంది. ఇద్దరం వెనక్కితిరిగి ఇంటికి పరుగులంకించాం. ఆ రోజు మా ప్లానులన్నీ బూడిదలో పోసిన పన్నీరువలె అయ్యాయి.

మర్నాడుకూడా బయలుదేరి వెళ్ళాం. సరిగ్గా ఆ చెట్టుదగ్గరే, ఆ స్థలంలోనే నిన్నటి పొజిషన్‌లోనే ఉన్నాడా మనిషి. ఏరా గోపీ వాడు మనిషి కాదేమోనురా! అని అన్నాను. వాడు మనిషి కాదని ఎలా ‘ప్రూవ్’ చెయ్యగలవు అని అడిగాడు.

నేను డిటెక్టివ్‌లాగ, చూశాను ఆ మనిషి నిన్న ఎక్కడున్నాడో, ఈవేళకూడా అక్కడే ఉన్నాడు. నిన్న కర్ర ఎలా పట్టుకున్నాడో ఈవేళ కూడా అలాగే పట్టుకున్నాడు. నిన్న ఏ పొజిషన్‌లో ఉన్నాడో, ఈరోజు కూడా అదే పొజిషన్‌లో ఉన్నాడు. కనుక అది దిష్టిబొమ్మ కాదు గదాయని నా అనుమానంరా! అని అన్నాను.

ఔన్రోయ్! నిజమే. అది దిష్టిబొమ్మ అయుండవచ్చు, నువ్వు ముందునడు అని అన్నాడు. ఇద్దరం భయంతో, అనుమానంతో, ఆ మనిషిని సమీపించాం. మా ఆనందానికి అంతులేదు. అది నిజంగా దిష్టిబొమ్మే.

మా జేబులు పట్టినన్ని కాయలు కోసుకున్నాం. సంతోషంగా ఇంటికి వచ్చాం. కడుపునిండా కాయలు తిన్నాం. మర్నాడుకూడా ఆ దిష్టిబొమ్మను గూర్చే మాట్లాడుకున్నాం. దిష్టిబొమ్మ ఎంతపని చేసిందో చూశావా! అని అన్నాడు గోపి నాతో.

—(o)—